సాక్షి వనపర్తి

ఆదివారం । 2 । ఫిబ్రవరి । 2025



.. వార్షిక బ్రహ్మోత్సవాలు

జోగుళాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం మూడోరోజు ఘనంగా కొనసాగాయి.

వివరాలు IIలో ▸



ముగిసిన ఉత్సవాలు

ఊర్కొండ: ఊర్కొండపేట అభయాంజనేయుడి ఉత్సవాలు శనివారం చక్రస్నానంతో ముగిశాయి.

గరిష్టం/కనిష్టం 35.8/16.7

వాతావరణం

మధ్యాహ్నం వేళ ఎండ తీవ్రత కనిపిస్తుంది. చలి ప్రభావం కాస్త తగ్గింది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది.

న్యూస్‌రీల్

బయో ఫర్టిలైజర్స్ పంపిణీ



కొత్తకోట రూరల్: మండలంలోని కనిమెట్టలో ఎస్సీ రైతులకు ఈసీఏఈ ఎస్సీ ఉప ప్రణాళిక నిధులతో కొనుగోలు చేసిన బయో ఫర్టిలైజర్‌ను మోజర్ల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డా. పిడిగం సైదయ్య ఆదేశానుసారం ఇన్‌చార్జ్ డీన్ షాహనాజ్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. రసాయన ఎరువుల వినియోగంతో నేల, వాతావరణం కలుషితమవుతుందని.. బయో ఫర్టిలైజర్ రైతుకు, పొలానికి, పంటకు రక్షణగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఎస్సీ సబ్‌ప్లాన్ ఇన్‌చార్జ్ బేబీ రాణి, ఏఈఓలు రమేశ్, వినయ్, గ్రామస్తులు పరమేశ్, సురేశ్, బాబు, మంద సురేందర్, యువకులు గజ్జల కృష్ణ, గౌని రాంరెడ్డి, మంద విశ్వేశ్వర్, నాగన్న, మంద మల్లేశ్, దయాకర్, భీంరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

వనపర్తి టౌన్: మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని ఈ నెల 12న తమిళనాడులోని అరుణాచలంలో గిరి ప్రదక్షిణకు వనపర్తి నుంచి సూపర్ లగ్జరీ బస్సును నడపనున్నట్టు డిపో మేనేజర్ వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడురోజుల యాత్రకు పెద్దలకు రూ.3,600, పిల్లలకు రూ.2,400 చొప్పున టికెట్ ధర నిర్ణయించామని.. దర్శనం టికెట్లు, టిఫిన్లు, భోజనం ఇతర ఖర్చులు ప్రయాణికులే భరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనానికి అవకాశం కల్పిస్తామన్నారు. 10వ తేదీ రాత్రి 8 గంటలకు బస్సు బయలుదేరుతుందని.. తిరిగి 13వ తేదీ ఉదయం 3 వరకు వనపర్తికి చేరుకుంటుందని వెల్లడించారు. ఆసక్తిగల భక్తులు సెల్‌నంబర్లు 99592 26289, 96765 63377, 79957 01851 సంప్రదించాలని సూచించారు.

లక్ష్మీవేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



కొత్తకోట రూరల్: మండలంలోని అమడబాకుల స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఏటా మాఘశుద్ధ తదియ నుంచి నవమి వరకు ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ ప్రధాన అర్చకుడు మరిగంటి జగన్మోహనాచార్యులు, ఆలయ కమిటీ సభ్యుడు విజయ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం భేరీపూజ, దేవతా ఆహ్వానం, 3న హోమం, బలిహరణం, కల్యాణం, రాత్రి ప్రభోత్సవం, డోలోత్సవం, 4న ఉదయం నిత్య పూజలు, హోమం, బలిహరణం, రథోత్సవం, 5న ఉదయం హోమం, సాయంత్రం గ్రామోత్సవం, బలిహరణం, రాత్రి దోపోత్సవం, 6న ఉదయం హోమం, పూర్ణాహుతి, తీర్థావరి, చక్రస్నానం, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, నాగవెల్లి, దేవత ఉద్వాసనంతో బ్రహోత్సవాలు ముగుస్తాయని వివరించారు. 7 నుంచి 16 వరకు జాతర కొనసాగుతుందని చెప్పారు.

కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈసారి కూడా కరుణించలేదు. సాగునీటి ప్రాజెక్టులు, పర్యాటక అభివృద్ధి, మాచర్ల–గద్వాల రైల్వేలైన్‌తో పాటు కొత్త మార్గాలు, కొత్త నవోదయ పాఠశాలల మంజూరు ఇలా ఏ ఒక్క దానికి శనివారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో పైసా విదిల్చలేకపోయారు. ఫలితంగా అన్నిరంగాల్లో వెనకబడిన ఉమ్మడి పాలమూరుకు మరోసారి మొండిచెయ్యే ఎదురైంది. అయితే వేతన జీవులకు రూ.12 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు, రైతాంగానికి కిసాన్ క్రెడిట్ కార్డులపై రూ.5 లక్షల వరకు రుణం, స్వదేశీ వస్తువులపై పన్ను మినహాయింపు ఉమ్మడి జిల్లాలోని రైతులు, చేనేత కార్మికులకు కొంత ఊరట కల్పించినట్లయింది. – సాక్షి, నాగర్‌కర్నూల్

- ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు **తప్పని భంగపాటు**
- పర్యాటకరంగ అభివృద్ధికి లభించని **చేయూత**
- ఊసేలేని మాచర్ల– గద్వాల, కొత్త రైల్వే **మార్గాలు**
- రూ.12 లక్షల వరకు ఆదాయపు పన్ను **మినహాయింపుపై** హర్షాతిరేకాలు
- కిసాన్ క్రెడిట్ కార్డుతో 5.50 లక్షల మంది **రైతులకు ప్రయోజనం**
- స్వదేశీ దుస్తులకు పన్ను తగ్గింపుతో 4,600 **చేనేత** కార్మికులకు మేలు
- ఈసారి నిరాశే మిగిల్చిన కేంద్ర బడ్జెట్



కరుణించని.. నిర్మలమ్మ

'పాలమూరు'కు మొండిచేయి

ఉమ్మడి జిల్లాకు జీవనాడిగా మారే పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదాతో పాటు ప్రాజెక్టు పనులను వేగంగా పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను కేంద్రం అందించాలన్న డిమాండ్ ఉండగా.. బడ్జెట్‌లో దీనిపై ప్రస్తావనే కరువైంది. దీంతో ఈ ప్రాజెక్ట్ పూర్తిచేయాల్సిన భారం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వంపైనే పడింది. అలాగే ఉమ్మడి పాలమూరులోని కొత్త జిల్లాలకు నవోదయ, కేంద్రీయ విద్యాలయాల మంజూరుపై ఆశలు పెట్టుకోగా నిరాశే ఎదురైంది. ఉమ్మడి జిల్లాలోని పురాతన, ప్రముఖ దేవాలయాలకు ప్రసాద్ స్కీం పథకం కింద కేంద్రం నుంచి నిధులు అందుతాయని ఆశించినా ఎలాంటి ప్రయోజనం దక్కలేదు. ఉమ్మడి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నప్పటికీ నిధుల కేటాయింపు లేకుండా పోయింది.

సులభంగా రుణాలు..

వ్యవసాయ **రంగంలో సాంకేతికత పెంచడం, వలసలు తగ్గించడమే లక్ష్యంగా కేంద్రం కొత్త నిర్ణయాలు** తీసుకుంది. పంటల ఉత్పాదకత, నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు పంచాయతీ, బ్లాక్ స్థాయిల్లో గోదాంలు, నీటి పారుదల, రుణ సౌకర్యాలను మరింత పెంచాలని నిర్ణయించింది. అలాగే రైతుల పెట్టుబడి కోసం అధిక వడ్డీ రేట్లకు అప్పులు చేయకుండా కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచింది. దీని ద్వారా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 5.50 లక్షలకుపైగా రైతులకు ప్రయోజనం కలగనుంది. వ్యవసాయం, మత్స్య, పశుసంవర్ధక రంగాల్లో ఖర్చులు, పరికరాల కొనుగోలు కోసం రైతులు స్వల్పకాలిక రుణాలు పొందవచ్చు. రానున్న ఐదేళ్లపాటు పత్తి పంట ఉత్పాదకత పెంచేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఇందుకోసం పత్తి పంట మద్దతు ధర పెంచేందుకు అవకాశం ఉంది.

చేనేత కార్మికులకు దన్ను..

ముఖ్యంగా మేక్ ఇన్ ఇండియా పథకంలో భాగంగా దేశంలో తయారైన స్వదేశీ దుస్తులకు పన్ను మినహాయింపు ఇవ్వడంతో ఉమ్మడి జిల్లాలోని గద్వాల, నారాయణపేట, వనపర్తి జిల్లాలో ఉన్న మర మగ్గాల కార్మికులకు మేలు జరగనుంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 4,600 మంది చేనేత కార్మికులకు ప్రయోజనం చేకూరనుంది. స్వదేశీ దుస్తులకు పన్ను మినహాయింపుతో చేనేత దుస్తుల ధరలు తగ్గనున్నాయి. కాగా.. పొగాకు, సిగరెట్లపై పన్నులను కేంద్రం పెంచడంతో వాటి ధరలు మరింత పెరగనున్నాయి.

గ్రామీణాభివృద్ధికే ప్రాధాన్యత..

కేంద్ర బడ్జెట్‌లో రక్షణ రంగం తర్వాత గ్రామీణాభివృద్ధికే అత్యధిక శాతం నిధులు కేటాయించింది. ఈ మేరకు మొత్తం రూ.2,66,817 కోట్ల కేటాయింపులు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమం కోసం వెచ్చించనుంది. దీంతో గ్రామాలు ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు మౌలిక వసతుల కల్పన, సమస్యల పరిష్కారానికి వేగంగా అడుగులు పడనున్నాయి. ఆ తర్వాత వ్యవసాయం, విద్య, ఆరోగ్య రంగాలకు ప్రాధాన్యం ఇచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి విరివిగా రుణాలు మంజూరు చేయనున్నారు. అంగన్‌వాడీ పోషణ్ 2.0 ప్రాజెక్ట్ ద్వారా చిన్నారులకు పోషకాహారం పెంచడంతో పాటు మరింత సమర్థవంతంగా సేవలు అందించేలా చర్యలు తీసుకోనున్నారు. అన్ని జిల్లాకేంద్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో 'డే కేర్ కేన్సర్ సెంటర్స్' ఏర్పాటు చేయనున్నారు.

వినతులు బుట్టదాఖలు



పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇవ్వాలని, నిధులు కేటాయించాలని చేసిన మా వినతులు బుట్టదాఖలయ్యాయి. కనీసం మా విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకోకపోవడం బాధాకరం. తెలంగాణ నుంచి కేంద్రానికి ప్రజలు ఏటా రూ.లక్ష కోట్ల వరకు పన్నులు కడుతున్నారు. కానీ, కేంద్రం మాత్రం రాష్ట్రానికి ఏమీ ఇవ్వడం లేదు. – మల్లురవి, ఎంపీ, నాగర్‌కర్నూల్

ప్రధానికి కృతజ్ఞతలు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా ఆమోద బడ్జెట్. సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలకు, వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారు. ప్రధానంగా ఆదాయపు పన్నులో రూ.12 లక్షల వరకు మినహాయింపు ఇవ్వడం శుభపరిణామం. పారిశ్రామిక, ఉత్పాదక రంగాలకు ప్రోత్సాహకాలు ఇచ్చారు. ప్రజలకు అనుకూలంగా బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రధాని మోదీతోపాటు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు. – డీకే అరుణ, ఎంపీ, మహబూబ్‌నగర్

తెలంగాణకు అన్యాయం..



త్వరలో ఎన్నికలు జరిగే ఢిల్లీ, బీహార్‌తో పాటు కూటమి ప్రభుత్వం ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్‌లో ఆశించిన మేర కేటాయింపులు జరిగాయి. రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు, ఆరుగురు ఎంపీలు ఉన్నా.. నిధుల కేటాయింపులు చేయించలేకపోయారు. కేంద్ర జీడీపీలో ఐదు శాతం రాష్ట్ర భాగస్వామ్యం ఉందంటూనే నిరాశకు గురిచేశారు. కేంద్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో అన్ని రాష్ట్రాలకు సమన్యాయం చేయాల్సి ఉండింది. – తూడి మేఘారెడ్డి, ఎమ్మెల్యే, వనపర్తి

రాజకీయ అవసరాల బడ్జెట్..



కేంద్ర బడ్జెట్ తమ రాజకీయ అవసరాలకు **రూపొందించి**నట్లుగా **ఉంది. ఏటా బడ్జెట్‌లో** కేంద్రం **పేర్కొంటున్న పద్దులు వ్యవ**సాయ **రంగాన్ని కుదేలు చేసేలా** ఉన్నాయి. ప్రతి బడ్జెట్‌లో **ఆహార రాయితీని కొంత**మేర తగ్గిస్తున్నారు. ఈ **విధానం పేద ప్రజలపై** ప్రభావం చూపిస్తుంది. 30 **సార్లు ఢిల్లీ వెళ్లిన ముఖ్యమం**త్రి రేవంత్‌రెడ్డి ఏం సాధించా**రో చెప్పాలి. తెలంగాణ** ప్రయోజనాలు పెంచే విషయంలో కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు విఫలమయ్యారు. – సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ మంత్రి

వికసిత భారత్ లక్ష్యంగా..



కేంద్ర ప్రభుత్వం నిర్దేశిత సమయం లోపు వికసిత భారత్ సాకారం చేయాలనే ఉద్దేశంతో ఏటా 8 శాతం జీడీపీ పెంచాలనే ప్రయత్నంగా వార్షిక బడ్జెట్ రూపొందించింది. ఆయా ప్రాంతాల అవసరాలను బట్టి అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం సాంప్రదాయమనే విషయం మరిచి విపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఉద్యోగులు, మహిళా సంఘాలకు భారీ ఎత్తున ఉరట కల్పించింది నేటి కేంద్ర బడ్జెట్. – నారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు, వనపర్తి

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- పాఠశాలలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించిన కలెక్టర్ ఆదర్శ్ సురభి
- మోడల్ పాఠశాలలో దొడ్డు బియ్యంతో మధ్యాహ్న భోజనం అందించడంపై ఆగ్రహం



మోడల్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

ఖిల్లాఘనపురం: పదోతరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి కోరారు. శనివారం మండలంలోని దొంతికుంటతండా స్టేజీ సమీపంలో ఉన్న తెలంగాణ మోడల్ పాఠశాల, మండల కేంద్రంలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, సరుకుల నాణ్యత, పాఠశాలల పరిసరాలు, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. మార్చి 21 నుంచి పదోతరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయని.. విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా సిద్ధం చేయాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు. మోడల్ పాఠశాలలో దొడ్డురకం బియ్యంతో మధ్యాహ్న భోజనం వండటంతో ప్రిన్సిపల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజనం వండిన తర్వాత సూపర్‌వైజర్లు రుచి చూసిన తర్వాతే విద్యార్థులకు వడ్డించాలన్నారు.

ఉగాది వరకు పూర్తి చేయాలి..

మండలంలోని మామిడిమాడలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను శనివారం కలెక్టర్ ఆదర్శ్ సురభి పరిశీలించారు. ఉగాది నాటికి నిర్మాణాలు పూర్తి చేసేలా పంచాయతీరాజ్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. కలెక్టర్ వెంట పంచాయతీరాజ్‌శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ మల్లయ్య, తహసీల్దార్ సుగుణ, ఎంపీడీఓ వెంకటాచారి, ఎంఈఓ జయశంకర్, సింగిల్‌విండో డైరెక్టర్ సాయిచరణ్‌రెడ్డి, బాలీశ్వర్‌రెడ్డి, ఏఈ రమేశ్‌నాయుడు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులను వేధిస్తే చర్యలు



మాట్లాడుతున్న ప్రమోదిని.. హాజరైన కమిటీ సభ్యులు

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమోదిని

వనపర్తి: పనిచేసే చోట మహిళా ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తే చర్యలు ఉంటాయని లోకల్ కంప్లయింట్ కమిటీ చైర్మన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమోదిని హెచ్చరించారు. శనివారం మధ్యాహ్నం జిల్లాకేంద్రంలోని ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జరిగిన లోకల్ కంప్లయింట్ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పురుషులతో సమానంగా మహిళలు పని చేసుకునేలా మహిళా రక్షణ చట్టాలు ఉన్నాయని.. కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాల మేరకు ఇప్పటికే అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఫిర్యాదు చేసేందుకు ఇంటర్నల్ కంప్లయింట్ కమిటీలు, జిల్లాస్థాయిలో లోకల్ కంప్లయింట్ కమిటీని ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యాలయాలు, ఇతర ప్రదేశాల్లో శారీరక, మానసిక వేధింపులకు గురిచేస్తే బాధితులు ఇంటర్నల్ కమిటీకి లేదా లోకల్ కమిటీకి ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజని మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఇంటర్నల్, లోకల్ కమిటీల్లో మహిళలకు అధిక ప్రాధాన్యం ఉంటుందని.. మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, కమిటీ సభ్యులు డీఆర్డీఓ ఉమాదేవి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి పరిమళ, రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షురాలు చిన్నమ్మ థామస్, సీడీపీఓలు లక్ష్మమ్మ, హాజీరా, బాలేశ్వరి, సూపరింటెండెంట్ అరుంధతి, జిల్లా మహిళా సాధికారిక కేంద్రం కో–ఆర్డినేటర్ భాస్కర్, జనరల్ స్పెషలిస్టులు శ్రీవాణి, సలోమి, స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షియల్ లిటరసీ సుమ, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

న్యాయవాద వృత్తి పవిత్రమైంది

- న్యాయవాదులు ధర్మంవైపు నిలబడాలి
- ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి: న్యాయవాద వృత్తి చాలా పవిత్రమైందని.. న్యాయవాదులు ధర్మం వైపు నిలబడాలని ఎస్పీ రావుల గిరిధర్ కోరారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఎస్‌డీఎం న్యాయ కళాశాలలో జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏదేని తప్పు జరిగినప్పుడు బాధితులు కోర్టును ఆశ్రయిస్తారని.. పూర్వాపరాలు విన్న న్యాయవాది నిజాయితీగా తప్పును చెప్పాలన్నారు. మహిళల భద్రతపై ప్రస్తావిస్తూ మహిళల రక్షణకు షీటీం ప్రత్యేకంగా పని చేస్తోందని.. విద్యార్థినులను వేధింపులకు గురిచేసినా, ర్యాగింగ్ చేసినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పాఠశాలలు, కళాశాలలు, బస్టాప్ తదితర ప్రాంతాల్లో ఎవరైనా వేధిస్తే షీటీం హెల్ప్‌లైన్ నంబర్ 63039 23211 లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. అదేవిధంగా వేధింపుల రకాలు, షీటీంను సంప్రదించే విధానం, గుడ్, బ్యాడ్ టచ్, విద్య ఆవశ్యకత, బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు, పోక్సో తదితర వాటి గురించి వివరించారు. అనంతరం మొదటి, రెండో సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాస్కర్, సీఐ కృష్ణ, షీటీం ఎస్‌ఐ అంజద్, షీటీం పోలీస్ సిబ్బంది శ్రీనివాసులు, కృష్ణ, శ్రీను, రమేశ్, ప్రొఫెసర్లు వెంకటసాయిప్రసాద్, విజయకుమార్, దర్గాస్వామి, కరుణాకర్, నర్మద, వినోద్‌రావు, నిఖిల్‌సాగర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



న్యాయ కళాశాలలో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

తల్లిదండ్రులు గర్వపడేలా ఎదగాలి..

యువత తమ సమయాన్ని వృథా చేయకుండా కఠోర సాధనతో అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు కృషిచేసి తల్లిదండ్రులు గర్వపడేలా ఎదగాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ, షీటీం సంయుక్తంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల దగ్గరకు వెళ్లి వారి లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదవాలని, కుటుంబ ఆర్థిక స్థితిగతులను అవగాహన చేసుకోవాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు విధిగా రహదారి నిబంధనలు పాటించాలని, విద్యార్థినులకు వేధింపులకు గురైతే షీటీంను సంప్రదించాలన్నారు.

71 మంది బాలకార్మికులకు విముక్తి..

ఆపరేషన్ స్మైల్–11 విడతలో జిల్లావ్యాప్తంగా 71 మంది బాలకార్మికులను గుర్తించామని.. అన్నిశాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేశామని ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. ప్రతి ఏటా ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ నిర్వహించి కిరాణం, మెకానిక్ దుకాణాలు, హోటళ్లు, వివిధ కంపెనీల్లో పనిచేస్తున్న, భిక్షాటన చేస్తున్న పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి వారికి అప్పగించడం లేదా స్టేట్ హోంకు తరలిస్తామన్నారు. ఆపరేషన్ స్మైల్–11లో 69 మంది బాలురు, ఇద్దరు బాలికలను పాఠశాలలో చేర్పించి వారిని పనిలో పెట్టుకున్న 8 మంది యజమానులపై కేసులు నమోదు చేశామని చెప్పారు. ప్రతి డివిజన్ పరిధిలో ఒక ఎస్‌ఐ, నలుగురు సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసి విస్తృతంగా తనిఖీలు చేశామన్నారు. కార్యక్రమ విజయవంతానికి కృషి చేసిన ఆయా శాఖల అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

89 మంది విద్యార్థులు గైర్హాజరు



పరీక్ష కేంద్రంలో డీఐఈఓ ఎర్ర అంజయ్య

వనపర్తి విద్యావిభాగం: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల ఇంగ్లీష్ ప్రయోగ పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసినట్లు డీఐఈఓ ఎర్ర అంజయ్య తెలిపారు. జిల్లా పరీక్షల కమిటీ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని జాగృతి, త్రివేణి, ముస్లిం మైనార్టీ, ప్రభుత్వ ఉర్దూ మీడియం జూనియర్ కళాశాలలను తనిఖీచేసి విద్యార్థుల రికార్డులు, మార్కుల నమోదును ఆయన పరిశీలించారు. ప్రాక్టికల్స్‌కు 20 మార్కులున్నాయని.. ప్రతి విద్యార్థి ఆంగ్లంలో మాట్లాడటానికే ప్రయోగ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 5,693 మంది విద్యార్థులకుగాను 5,604 మంది హాజరుకాగా.. 89 మంది గైర్హాజరైనట్లు వివరించారు. డీఐఈఓ వెంట జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు నరేంద్రకుమార్, శ్రీనివాసులు ఉన్నారు.

తాగునీటి ఇబ్బందులు రానివ్వం



గ్రామస్తులతో సమావేశమైన అధికారులు

ఆత్మకూర్: వేసవిలో జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ జైపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి, గ్రిడ్ ఏఈ హర్షవర్ధన్‌తో కలిసి మండలంలోని బాలకిష్టాపూర్‌లో నీటి సరఫరాను పరిశీలించి గ్రామస్తులతో సమావేశమయ్యారు. నిత్యం గ్రామస్తులకు అందుబాటులో ఉంటూ తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. పైప్‌లైన్ లీకేజీలు, మోటార్ల మరమ్మతులను ఎప్పటికప్పుడు గుర్తించి మరమ్మతులు చేయించాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి హరిరాంసాగర్, మాజీ సర్పంచ్‌లు తుకరాంనాయక్, సత్యన్న, గ్రామస్తులు ఉన్నారు.

ఆవాస ప్రాంతాల రహదారులకు మహర్దశ

వనపర్తి: రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ పరిధిలోని ఎస్టీ ఆవాస ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి రూ.ఆరు కోట్లు, ఎస్సీ కాలనీల్లో సీసీ రహదారుల నిర్మాణానికి రూ.పది కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శనివారం తెలిపారు. ఈ నిధులతో ఖిల్లాఘనపురం, గోపాల్‌పేట, పెద్దమందడి, వనపర్తి మండలాల పరిధిలోని తండాలు, గ్రామీణ ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం, గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నామన్నారు. కాంగ్రెస్‌పార్టీ గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉందని చెప్పారు. నిధుల మంజూరుకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవికి కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వాహనం ఢీ.. వ్యక్తి మృతి

గద్వాల క్రైం: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు, బంధువుల కథనం మేరకు.. కేటీదొడ్డి మండలానికి చెందిన వీరన్న(38) బైక్‌పై గద్వాలకు వచ్చి తిరిగి వెళ్తుండగా గోనుపాడు గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో వీరన్న అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య అనంతమ్మ ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సతీమణి జ్యోతి, బీఆర్‌ఎస్ నాయకుడు హనుమంతునాయుడు తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

చికిత్సపొందుతూ మరొకరు..

నవాబుపేట: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మరికల్ గ్రామానికి చెందిన కటికె నగేష్(36), అన్నదమ్ముల మధ్య కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది పొలం వద్ద గత నెల 30న పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆ సమయంలో భార్యకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పాడు. ఆమె చుట్టుపక్కల వారితో కలిసి పొలానికి వెళ్లి అపస్మారకస్థితిలో ఉన్న నగేష్‌ను 108లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న నగేష్ శనివారం మృతి చెందాడు. అతని భార్య లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా మధ్యతరగతి ఉద్యోగులకు ఈ బడ్జెట్ ఊరట ఇవ్వగా మిగిలిన అన్ని వర్గాలకు నిరాశ పరిచిందనే చెప్పాలి. ఆదాయ పన్ను మినహాయింపు పెంచడంతో చాలావరకు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పేదలకు మాత్రం చెప్పుకోదగ్గ రాయితీలు, కేటాయింపులు ప్రభుత్వం ప్రకటించలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వెనుకబడిన పాలమూరు జిల్లాకు బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు ఏమీ జరగలేదు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీహార్, ఢిల్లీ వంటి రాష్ట్రాలకు ప్రత్యేక కేటాయింపులు జరిగాయి. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలు సైతం కేటాయింపుల కోసం ఎలాంటి ప్రయత్నం చేయలేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

– సాక్షి, నెట్‌వర్క్

కలలు సాకారం..



కేంద్ర బడ్జెట్ కేవలం లెక్కల పద్దు మాత్రమే కాదు. వికసిత్ భారత్‌కు ఒక రోడ్ మ్యాప్ వంటిది. రైతు సంక్షేమం నుంచి మధ్య తరగతి ఉపశమనం వరకు, మహిళలు, యువతకు సాధికారత కల్పించారు. మౌళిక సదుపాయాల కల్పన, పెట్టుబడులను ప్రోత్సహించారు. ఈ బడ్జెట్ ద్వారా దేశంలోని ప్రతిఒక్కరిని వారి కలలను సాకారం చేసే దిశగా సాగింది. భవిష్యత్‌కు బంగారు బాటలు వేసేలా ఉంది.

– శాంతికుమార్, బీజేపీ రాష్ట్ర కోశాధికారి

సముచిత స్థానం..



కేంద్ర బడ్జెట్‌లో అన్ని రంగాలు, అన్నివర్గాలకు సముచిత స్థానం కల్పించారు. ప్రధానంగా పేదలు, సామాన్యుల ప్రయోజనం కోసం ప్రభుత్వ ఆస్పత్రుల్లో క్యాన్సర్ గుర్తించే విభాగం ఏర్పాటు చేయాలని నిర్ణయించడం గొప్ప విషయం. అలాగే ఐదెకరాలు కలిగిన ప్రతి రైతుకు క్రెడిట్ కార్డు ఇవ్వడం బాగుంది. ఆదాయ పన్ను మినహాయింపు రూ.12 లక్షలకు పెంచడంతో మధ్య తరగతి వారికి మేలు జరుగుతుంది.

– శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మహబూబ్‌నగర్

రాష్ట్రానికి అన్యాయమే..



రాష్ట్రంలో బీజేపీకి ఆరుగురు ఎంపీలు, ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా కూడా కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగింది. పాలమూరు ఎత్తిపోతలకు ఈ బడ్జెట్‌లో మరోసారి మొండిచేయి చూపారు. ఐటీకి సంబంధించి రాష్ట్రానికి ఒక్క ప్రాజెక్టు ప్రకటించలేదు. డిజిటల్ ఇండియా అని చెప్పే పీఎం మోదీ దానికి సంబంధించి ఏ ఒక్క రాయితీ కూడా ఇవ్వలేకపోయారు.

– ఒబేదుల్లా కొత్వాల్, చైర్మన్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్

కార్పొరేట్లకు అనుకూల బడ్జెట్



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు వ్యతిరేకంగా స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు అనుకూలంగా ఉంది. ఉపాధి హామీ పథకానికి 86వేల కోట్లు మాత్రమే కేటాయించారు. తెలంగాణకు ఈ బడ్జెట్ వల్ల తీవ్ర అన్యాయం జరిగింది. జిల్లాకు మంజూరైన నవోదయ విద్యాలయానికి ఈబడ్జెట్‌లో నిధులు కేటాయించి పూర్తిచేయాలి.

– సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు, మహబూబ్‌నగర్

ఢిల్లీ, బిహార్‌ల కోసమే..



కేంద్ర బడ్జెట్ ఢిల్లీ, బిహార్‌లో ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రవేశపెట్టినట్లుగా ఉంది. వైద్యంపై కొన్ని స్కీంలు ప్రకటించినా విద్యకు ప్రాధాన్యత ఇవ్వలేదు. గ్రామీణ ఉపాధి, రాష్ట్రంలోని ఆర్‌ఆర్‌ఆర్, మెట్రో విషయాలను ప్రస్తావించలేకపోయారు. జీతాలపై పన్ను మినహాయింపు ఇచ్చినా.. కొన్ని స్లాబ్‌లలో 25, 30 శాతం ట్యాక్స్ ఉండటం అభ్యంతరకరం.

– తిమ్మప్ప, పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్

ఉద్యోగులకు ఊరట



ఆదాయ పన్ను పరిమితి పెంచడంతో మధ్యతరగతి ఉద్యోగులకు బడ్జెట్‌లో భారీ ఊరట కలిగింది. గతంలో ఏడు లక్షలు ఉన్న పన్ను పరిమితిని 12లక్షలకు కేంద్ర ప్రభుత్వం పెంచింది. పన్ను స్లాబ్స్‌ను సవరించాలి.

– కృష్ణారెడ్డి, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు, కల్వకుర్తి

తెలంగాణకు రిక్తహస్తం



కేంద్రం ఈసారి బడ్జెట్‌లో తెలంగాణకు రిక్తహస్తం చూపించింది. మరోసారి ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాష్ట్రం పట్ల వివక్ష చూపారు. రాష్ట్రంలోని 8మంది బీజేపీ ఎంపీలు స్పందించాలి. వ్యవసాయ రంగంలో సంస్కరణలు పెట్టుబడిదారుల కోసమే అనేది స్పష్టమవుతోంది.

– ఎస్‌ఎండీ.ఫయాజ్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు

కేంద్రం విఫలం..



ఉద్యోగుల ప్రయోజనాలు కాపాడటంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైంది. ఆదాయపు పన్ను పరిమితి రూ.12 లక్షలకు పెంచుతున్నట్లుగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం ఎవరికి తెలియకుండా ఇంతకు ముందు పొందుతున్న ఇంటి అద్దె, లైఫ్ హెల్త్ ఇన్సురెన్స్, ఇంటి రుణం, వడ్డీ మినహాయింపులను రద్దు చేసి.. ఉద్యోగులకు తీవ్ర ఆర్థిక నష్టం కలిగించింది. దీంతో ప్రతి ఉద్యోగి కచ్చితంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

– షేక్ ఫారుఖ్ హుస్సేన్, మహబూబ్‌నగర్

రాష్ట్రాన్ని విస్మరించింది..



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రాన్ని పూర్తి విస్మరించింది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వకపోవడం, నంద్యాల-జడ్చర్ల, మునీరాబాద్-డోర్నకల్ నూతన రైల్వే లైన్లకు నిధులు కేటాయించలేదు. మహబూబ్‌నగర్ నుంచి ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న డీకే అరుణ 'పాలమూరు-రంగారెడ్డి'కి నిధులు సాధించకపోవడం ఆమె వైఫల్యం.

– బాల్‌నర్సింహ్మ, సీపీఐ జిల్లా కార్యదర్శి, నాగర్‌కర్నూల్

పన్ను మినహాయింపు పెంచడం..



మధ్యతరగతి ఉద్యోగులకు ఆదాయ పన్ను మినహాయింపు భారీగా పెంచడం హర్షనీయం. వేతన జీవులకు కేంద్ర బడ్జెట్ ఈసారి కాస్తంత ఊరటనిచ్చింది. ఎలాంటి వడ్డింపులు లేకుండా జీఎస్టీని కొనసాగిస్తూ, ఇతర పన్నులను విధించి ధరలను నియంత్రణకు యత్నించడం బాగుంది.

– పట్నం చెన్నయ్య, బహుజన టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు, మహబూబ్‌నగర్

జోగుళాంబ వార్షిక బ్రహ్మోత్సవాలకు రండి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించిన ఈఓ, ఆలయ పాలకమండలి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ చైర్మన్, ఈఓ.. చిత్రంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

అలంపూర్: అలంపూర్ జోగుళాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించినట్లు ఆలయ పాలక మండలి సభ్యులు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ఈఓ పురేందర్‌కుమార్ ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌తో కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం, ఆహ్వాన పత్రిక అందజేసినట్లు పేర్కొన్నారు. 3వ తేదీ వసంత పంచమి రోజున అమ్మవారి నిజరూప దర్శనం, సహస్ర ఘటాలతో అభిషేకం ఉంటుందని హాజరు కావాలని కోరామన్నారు. అదేవిధంగా ఈ నెల 25 నుంచి మార్చి 1 వరకు బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు కొనసాగుతాయని.. ఇందుకు సంబంధించిన ఆహ్వానపత్రికను కూడా అందజేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఆలయ ధర్మకర్తలు సరస్వతి, చంద్రశేఖర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, గోపాల్, పులేందర్, వెంకటేశ్వర్లు, జి.వెంకటేశ్వర్లు, జగన్మోహన్‌నాయుడు, జయరాముడు, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు, ఎక్స్ ఆఫీషియో సభ్యుడు డి.ఆనంద్‌శర్మ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు

జోగుళాంబ అమ్మవారి వార్షిక బ్రహోత్సవాలు శనివారం మూడోరోజుకు చేరాయి. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన, త్రిశతి, విశేష అర్చనలు, చండీహోమాలు, పవమాన సూక్త పారాయణం, పవమాన సూక్త హోమాలు, అవాహిత దేవతా హోమాలు, మండపారాధన, బలిహరణం, నీరాజన మంత్రపుష్పములు తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరో రెండ్రోజుల పాటు బ్రహోత్సవాలు కొనసాగుతాయని ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు. చివరిరోజు అమ్మవారు భక్తులకు నిజరూప దర్శనం ఇవ్వనున్నట్లు వివరించారు.

లారీని ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు





గాయపడిన వారిని అంబులెన్స్‌లో తరలిస్తున్న స్థానికులు, ప్రమాదంలో దెబ్బతిన్న ప్రైవేటు బస్సులు

- వెనుక నుంచి మరో బస్సు ఢీ
- 12 మందికి గాయాలు

అలంపూర్ : జాతీయ రహదారిపై ఒక లారీ, రెండు బస్సులు ఢీకొన్న ప్రమాదంలో పలువురు గాయపడిన సంఘటన అలంపూర్ చౌరస్తా సమీపంలోని 44వ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారు జామున జరిగింది. ఉండవెల్లి ఎస్‌ఐ మహేష్ తెలిపిన వివరాలు.. పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలోని దూన్ దాబా వద్ద బండల లోడ్‌తో ఉన్న లారీ అకస్మాత్తుగా యూటర్న్ తీసుకుంటుండగా హైదరాబాద్ నుంచి కడపకు వెళ్తున్న సీజీఆర్ ట్రావెల్స్ బస్సు ఢీకొంది. అదే సమయంలో కావేరీ ట్రావెల్స్ బస్సు సీజీఆర్ ట్రావెల్స్ బస్సును వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో డ్రైవర్లు బాబాసాహెబ్, చంద్రశేఖర్‌లతో పాటు ప్రయాణికులు సమీర, రోహిత్, ప్రసాద్, అజయ్, బాబు, సందీప్, శ్రీధర్, సావిత్రి, లక్ష్మిదేవి, ఓబుల్ రెడ్డి, జగదీష్, రాఘవరెడ్డి గాయపడ్డారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. సీజీఆర్ ట్రావెల్స్ మేనేజర్ చెన్నమ్మ శెట్టి రెడ్డయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేష్ పేర్కొన్నారు.

చేపల వేటకెళ్లి ఇద్దరి మృతి



జోగు మల్లయ్య(ఫైల్)



సత్తయ్య(ఫైల్)

బల్మూర్: చేపల వేటకెళ్లి వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మృతి చెందారు. నాగర్‌కర్నూలు జిల్లా బల్మూర్ మండలంలో కొండనాగులలో ఒకరు.. తిమ్మాజీపేట మండలం ఆవంచలో మరొకరు మృతిచెందారు. చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మూడు రోజుల తరువాత కుంటలో శవమై తేలిన సంఘటన బల్మూర్ మండలంలోని కొండనాగుల గ్రామంలో శనివారం చోటుచేసుకున్నట్లు ఏఎస్‌ఐ చాంద్‌పాషా తెలిపారు. వివరాలు.. కొండనాగులకు చెందిన జోగు మల్లయ్య(45) గ్రామ సమీపంలోని నాగులకుంటలో గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా చేపల వేటకెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఊర్లలో రెండు రోజులు వెతికినా ఆచూకి లభించలేదు. శనివారం ఉదయం కుంటకట్టపై నుంచి వ్యవసాయ పొలాలకు వెళ్తున్న కూలీలకు తేలిఉన్న శవం కనిపించడంతో ఒడ్డుపై అతని దుస్తులు, చెప్పులను గమనించి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. మృతుడికి భార్య చిట్టెమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి మృతదేహాన్ని అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ఆవంచలో..

తిమ్మాజీపేట: మండలంలోని ఆవంచలో ఎలికట్ట సత్తయ్య(42) అనే వ్యక్తి చేపల వేటకెళ్లి మృతిచెందినట్లు ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. సత్తయ్య శుక్రవారం సాయంత్రం పొలానికి వెళ్తున్నానని ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లాడు. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలో వెతికినా కనిపించలేదు. శనివారం ఉదయం చెరువు కట్టపై అతడి చెప్పులు, బట్టలను గుర్తించారు. చేపల వలలో చుట్టుకొని మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జడ్చర్ల ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య అలివేల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.


బొటానికల్ గార్డెన్ సందర్శన



గార్డెన్‌లో కర్ణాటక విశ్వవిద్యాలయం విద్యార్థులు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల బొటానికల్ గార్డెన్‌ను శనివారం కర్ణాటక విశ్వవిద్యాలయం విద్యార్థులు సందర్శించారు. దార్వాడ్‌లో వృక్షశాస్త్ర విభాగంలో ఎమ్మెస్సీ చదువుతున్న 51 మంది విద్యార్థులు, ముగ్గురు ఆచార్యులు, ప్రొఫెసర్ తంగాదురై ఆధ్వర్యంలో వారు గార్డెన్‌ను సందర్శనకు వచ్చారు. వారికి కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య స్వాగతం పలికారు. గార్డెన్ సమన్వయకర్త సదాశివయ్య గార్డెన్‌లోని వివిధ విభాగాలను చూయించి అవగాహన కల్పించారు. గార్డెన్‌ను విద్యార్థులు ఏర్పాటు చేయగా దాని బాగోగులు సైతం వారే చూసుకుంటున్నారని వివరించారు. గార్డెన్‌కు అనుబంధంగా ఉన్న జీవవైవిధ్య పరిశోధన విద్యాకేంద్రాన్ని సందర్శించి అక్కడ భద్రపర్చిన అతిపెద్ద జెర్రిపోతు కుబుసాన్ని, ఇటీవల జడ్చర్ల పరిసరాల్లో పట్టుకున్న పాములను చూశారు. గార్డెన్ సందర్శన అనంతరం ప్రొఫెసర్ తంగాదురై మాట్లాడుతూ అతి తక్కువ స్థలంలో ఇలాంటి గార్డెన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎక్కువ జాతుల మొక్కలు పెంచడం అద్భుతమన్నారు.

జాతీయ రహదారిపై కారు దగ్ధం



దగ్ధమవుతున్న కారు

జడ్చర్ల: పట్టణ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం ఓ కారు దగ్ధమైంది. ఎస్‌ఐ శివానందంగౌడ్ వివరాల మేరకు.. జడ్చర్లకు చెందిన రాజశేఖర్ రెడ్డి తన కారులో జిల్లా కేంద్రానికి వెళ్లి వస్తుండగా.. మయూరి నర్సరీ సమీపంలో బైక్‌ను ఢీకొట్టడంతో కారు ముందుభాగం ధ్వంసమైంది. అయితే కారును జడ్చర్ల మీదుగా హైదరాబాద్ వైపు తీసుకెళ్తుండగా.. ఇంజన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కారు డ్రైవర్‌తో పాటు రాజశేఖర్ రెడ్డి బయటికి రావడంతో ప్రాణాపాయం తప్పింది. సమాచారం అందుకున్న ఫైర్‌స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోక్సో కేసు నమోదు

మల్దకల్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన బాలుడు లైంగిక వేధింపులకు పాల్పడడంతో గమనించిన కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారించిన పోలీసులు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లక్ష్మీచెన్నకేశవుడి ధ్వజారోహణం

అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు



ధ్వజారోహణ పతాకావిష్కరణ చేస్తున్న పండితులు

జడ్చర్ల టౌన్: లక్ష్మీచెన్నకేశవుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో ఉదయం వేదపండితుల మంత్రోచ్చరణల, భక్తుల చెన్నకేశవ నామస్మరణల మధ్య ధ్వజారోహణం నిర్వహించారు. ధ్వజస్తంభంపై పతాకావిష్కరణ చేసి ధ్వజాదివాసం, ప్రాణప్రతిష్ఠ, బలిహరణం జరిపించారు. సాయంత్రం భేరిపూజ, దేవతాహ్వానం చేశారు. ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామికి పూజలు చేసుకున్నారు. రాత్రి హనుమాన్‌వాహనసేవలో భాగంగా గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

నేడు కల్యాణం

ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామి అమ్మవార్ల కల్యాణం జరిపించనున్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

తాడిపర్తి లక్ష్మిసముద్రంలో భారీ మొసలి



గోపాల్‌పేట: మండలంలోని తాడిపర్తి లక్ష్మి సముద్రం చెరువులో భారీ మొసలి కనిపించడంతో సమీప పొలాల రైతులు భయాందోళనకు గురవుతున్నారు. వారం రోజులుగా చెరువు ఒడ్డుపై కనిపిస్తుందని.. దగ్గరగా వెళ్లేసరికి లోనికి వెళ్తున్నట్లు చెప్పారు. గొర్రె పిల్లలు, మేకలు తదితర మూగజీవాలు నీరు తాగేందుకు చెరువులోకి వెళ్తుంటారని.. అలాగే మత్స్యకారులు సైతం చేపల వేట చేపడతారని, ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని భయపడుతున్నారు. సంబంధిత అధికారులు మొసలిని పట్టుకొని తీసుకెళ్లాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు. రెండు నెలల కిందట గోపాల్‌పేట అమ్మచెరువులో ఓ మొసలి కనిపించేదని.. అదే ఇప్పుడు ఈ చెరువులోకి వచ్చి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

రహదారి బాగు చేయాలని వినతి



మదనాపురం: ఆత్మకూరు వైపు వెళ్తున్న ఆర్అండ్‌బీ రోడ్డు మదనాపురం మండల కేంద్రం వద్ద గుంతలు ఏర్పడి తీవ్ర ఇబ్బందులు ఎదురౌతున్నాయని, కొన్ని రోజులుగా అధికారులు పట్టించుకోవడం లేదని శనివారం ఆర్అండ్‌బీ ఈఈ సీతారామస్వామికి బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బిట్లి రాజశేఖర్ ఫిర్యాదు చేశారు. రైల్వేగేటు నుంచి నెల్విడి స్టేజీ వరకు రోడ్డు గుంతలతో చాలా ఇబ్బందికరంగా ఉందన్నారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. గుంతలు ఉండటం వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పతోందని తెలిఆపరు. సత్వరమే అధికారులు స్పందించి మరమ్మతు చేయించాలని, ఊక చెట్టు వాగుపై నిర్మాణమవుతున్న బ్రిడ్జి పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు, కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు రాము, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ సాధించిన అధ్యాపకుడికి సన్మానం



వీపనగండ్ల: పాలమూరు ఆర్గానిక్ కెమిస్ట్రీ యూనివర్సిటీ అధ్యాపకుడిగా పనిచేస్తూ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ సాధించిన డాక్టర్ మీసాల జ్ఞానేశ్వర్‌ను శనివారం ఘనంగా సన్మానించినట్లు ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు మీసాల నాగరాజు, పామునాగులు, రవివర్మలు తెలిపారు. ఎస్సీ లో ఏబీసీడీ వర్గీకరణ అమలు కోసం ఈనెల 7న జరిగే 'లక్ష డప్పులు వేల గొంతుకలు' సన్నాహక కార్యక్రమం యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డా దరువు ఎల్లన్న, డా.నల్లగంటి శరత్, ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు, సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం



కొత్తకోట రూరల్: మండలంలోని నాటవెల్లి పెద్దతండా గ్రామ పంచాయతీలో గర్భిణులకు శనివారం అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ బి.మమత మాట్లాడుతూ గర్భిణులు పోషకాహారం తీసుకుంటే పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ సహాయకురాలు లక్ష్మి ఉన్నారు.

పాఠశాలకు డ్రమ్స్ వితరణ



పాన్‌గల్: మండలంలోని అన్నారంతండా ప్రాథమిక పాఠశాలకు 2003–2004 సంవత్సరం పూర్వ విద్యార్థులు రూ.5వేల విలువైన డ్రమ్స్, ఆట సామాగ్రి, చార్ట్స్‌ను పాఠశాలకు అందజేశారు. ఈ సదర్భంగా పూర్వ విద్యార్థులు రాజునాయక్, రవినాయక్, రాంబాబు నాయక్, పాండునాయక్, పాపియనాయక్, చందూనాయక్‌లను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం చెన్నమ్మ, తండావాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జోగుళాంబ జాతర విజయవంతం చేద్దాం

అలంపూర్: జోగుళాంబ జాతరను విజయవంతం చేద్దామని జోగుళాంబ సేవా సమితి అధ్యక్షుడు బండి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. అలంపూర్ పట్టణంలోని హరిత హోటల్‌లో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బండి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈనెల 3వ తేదీ వసంత పంచమిని పురస్కరించుకుని జోగుళాంబ సేవా సమితి ఆధ్వర్యంలో జోగుళాంబ జాతర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతరలో భాగంగా గ్రామ దేవతల వేషధారణతో ఉదయం 9 గంటలకు గంటలేశ్వర ఆలయం నుంచి బయల్దేరి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకోనున్నట్లు పేర్కొన్నారు. వసంత పంచమి ఉత్సవాలకు భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న రాజశేఖర్



గోపాల్‌పేట పీహెచ్‌సీలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి శ్రీనివాసులు



పాన్‌గల్‌లో మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్

గోపాల్‌పేట: మండలంలోని అన్ని సబ్‌సెంటర్లలో ఉచితంగా నిర్వహించే షుగర్ పరీక్షలు ప్రజలందరూ చేయించుకోవాలని జిల్లా వైద్యాధికారి శ్రీనివాసులు కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సబ్‌సెంటర్‌లో ఆయా గ్రామాల్లో చేపట్టబోయే ఉచిత షుగర్ టెస్టులు, సోమవారం నుంచి క్యాన్సర్ టెస్టులు కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అందరికీ అవగాహన కల్పించాలని ఆయన కోరారు. గోపాల్‌పేట మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో డాక్టర్లు, సిబ్బందితో సమావేశమై పలు విషయాలు వెల్లడించారు.కార్యక్రమంలో డాక్టర్ కృష్ణకుమారి, డాక్టర్ చాంద్‌పాషా, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సిద్దగౌడ్, మహేశ్వరాచారి, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మధుమేహంపై సమగ్ర సర్వే నిర్వహించాలి

వీపనగండ్ల: మండలంలోని వైద్య సిబ్బంది 30 ఏళ్లు పైబడిన వారికి మధుమేహ పరీక్షలు నిర్వహించి, వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మండల వైద్యాధికారి రాజశేఖర్ తెలిపారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్య సిబ్బందితో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డా.హేమవర్ధన్, వైద్యాధికారులు డా.కరుణ, తహూరారియాశ్రీ,, హెచ్‌ఈ కేశవులు, సీహెచ్‌ఓ దయామని, సూపర్‌వైజర్లు కమలమ్మ, విజయకుమారి, హెల్త్ అసిస్టెంట్లు రాములు, జహంగీర్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

30 ఏళ్లు దాటిన వారికి పరీక్షలు

పాన్‌గల్: 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ మధుమేహ(షుగర్) పరీక్షలు నిర్వహించాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ సిబ్బందికి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కలెక్టర్ ఆదేశానుసారం ఈనెల 3 నుంచి గ్రామాల్లో బీద, ధనిక తేడా లేకుండా మధుమేహ పరీక్షలు నిర్వహించాలన్నారు. పుట్టిన పిల్లల నుంచి పెద్దల వరకు ఈ వ్యాధి వస్తుందన్నారు. తరుచుగా మూత్ర విసర్జన, అధికదాహం, విపరీతమైన ఆకలి, బరువు తగ్గడం, అలసట, అస్పష్టమైన దృష్టి, గాయాలు త్వరగా మానకపోవడం, తరచుగా అంటువ్యాధులు, అనారోగ్య సమస్యలు వంటి లక్షణాలున్న వారు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. సమావేశంలో సీహెచ్‌ఓ రామయ్య, ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ వైద్యులు, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించాలి

పాన్‌గల్: చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించి వారిని రోగాల నుంచి కాపాడుకోవాలని ఏఎన్‌ఎం సుమిత్ర చిన్నారుల తల్లిదండ్రులకు సూచించారు. శనివారం మండలంలోని మాధరావుపల్లి గ్రామంలో చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు, పౌష్టికాహారంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయించడంతో వ్యాధి నిరోధక శక్తి పెరిగి, రోగాలకు దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్, ఆశా కార్యకర్త, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ ఆలయానికి విరాళాలు



కొత్తకోట: కొత్తకోట పట్టణ శివారులో నూతనంగా నిర్మించిన శ్రీ కృష్ణ దేవాలయానికి పట్టణ వాసులు భీమ రాజేశ్వరమ్మ రాములు దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు భీమ భారతిబాలకృష్ణ, భీమ విజయలక్ష్మీవెంకటేష్, వారి బ్రదర్స్ ఆలయ విగ్రహ ప్రతిష్ఠకు రూ.50,116లు విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. పట్టణానికి చెందిన ఎద్దుల నారాయణరెడ్డి వారి కుటుంబ సభ్యులు 10 క్వింటాళ్ల సన్న బియ్యం విరాళంగా అందజేశారు. మదనాపురం మండలం గోవిందహళ్లి గ్రామానికి చెందిన శ్రీ నందగోపాలకృష్ణ యాదవ సంగం సభ్యులు రూ.50,116లు విరాళం ఇచ్చారు. ఈ నెల 13,14,15వ తేదీలలో ఆలయ ప్రారంభ ఉత్సవాలకు విరాళాలు ఇచ్చిన వారితో పాటు పట్టణ ప్రజలంతా ప్రారంభోత్సవంలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

ఆలయ నిర్మాణానికి పూజలు



ఆత్మకూర్: ఆత్మకూర్ పట్టణంలోని రాజవీధిలో పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా అమ్మవారి విగ్రహ జీర్ణోద్ధరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం వేదపండితుల ఆధ్వర్యంలో పెద్దమతల్లి మూర్తి జీర్ణోద్ధరణ, పూర్వక కలాపకర్షణ, ఉద్యాపన, గణపతిపూజ, హోమం, అభిశేఖం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వందల ఏళ్లక్రితం నిర్మించిన పెద్దమ్మ గుడి పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో పునర్నిర్మాణానికి రూ.1.50 కోట్లు అవసరమని, భక్తులు విరాళాలు అందించి ఆలయ నిర్మాణానికి సహకరించాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డాక్టర్ శ్రీధర్‌గౌడ్, శృతి జువెల్లర్స్ అధినేత గాడి లక్ష్మీనారాయణ, వాస్తుపండితుడు రమాకాంత్, భక్తులు ఉన్నారు.

మత్తుపదార్థాలపై ప్రజలకు అవగాహన

వనపర్తి రూరల్: మండలంలోని చిమనగుంటపల్లి గ్రామంలో శనివారం రాత్రి వనపర్తి రూరల్ ఎస్‌ఐ జలెందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, డ్రగ్స్ మరియు గంజాయి వంటి మత్తు పదార్థాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై యువకులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. వాట్సాప్‌కు ఫీఎం కిసాన్ ఏపీకే పేరిట వచ్చిన లింక్‌లు ఓపెన్ చేయరాదని, చేసిన మీ ఖాతాలో ఉన్న డబ్బులు పోతాయని వారికి వివరించారు. యువత మత్తు పదార్థాలకు బానిసా అవుతూ, నేరాలకు పాల్పడుతున్నారన్నారు. ఎవరైనా ఆన్‌లైన్ మోసాలు గురైతే 1930 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వివేకానంద యూత్ సభ్యులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ముందుజాగ్రత్తతోనే ప్రమాదాల నివారణ

- హెల్మెట్ల పంపిణీలో బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్



హెల్మెట్లను పంపిణీ చేస్తున్న వాకిటి శ్రీధర్

వనపర్తి టౌన్: ముందు జాగ్రత్తలు పాటిస్తూ ప్రయాణం సాగిస్తే అనుకోకుండా ఎదురయ్యే ప్రమాదాలను నివారించవచ్చని బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ అన్నారు. సామాజిక కార్యకర్త టైలర్ మన్యం నేతృత్వంలో శనివారం ఉచితంగా హెల్మెట్లను జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌక్‌లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ ప్రయాణ సమయంలో తప్పు మనవైపు లేకపోయినా ఏదో రకంగా ప్రమాదం పొంచి ఉండవచ్చని, అలాంటి ప్రమాదాల నుంచి హెల్మెట్ ధరించడం ద్వారా మేలు కలుగుతుందన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాలపై సామాజిక కార్యకర్తలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి హెల్మెట్ల పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బచ్చు రాము, గంధం నాగరాజు, అశోక్, చిట్యాల రాము తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ప్రేరణ తరగతులు



మణిగిళ్ల మాట్లాడుతున్న అశోక్‌గౌడ్

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని మణిగిళ్ల జెడ్పీహెచ్ఎస్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు అశోక్‌గౌడ్ 10వ తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. విద్యార్థులలో పరీక్షల భయం తొలగించడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించడంతో పాటు పరీక్షలను భయం లేకుండా నిర్భయంగా రాయాలన్నారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులు 500మార్కులు దాటించిన ప్రతి ఒక్కరికీ రూ.1000 పారితోషికం ఇవ్వడం జరుగుతుందన్నారు. పెద్దమందడి మండలంలోని ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఎవరైనా మండల టాపర్‌గా వచ్చిన వారికి రూ.5వేలు నగదు పారితోషికాన్ని అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అడ్డాకుల వెంకటేశ్వర్లు, జానయ్య, రఫీ, సుధాకరాచారి, బలరాముడు, సాంబశివుడు, రాధిక, శ్రీరామ్ తదితరులు ఉన్నారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శికి సన్మానం



హైదరాబాద్‌లో రాష్ట్ర కార్యదర్శిని సన్మానించిన జిల్లా నాయకులు

వనపర్తి రూరల్: వనపర్తి జిల్లా అమరచింత గ్రామానికి చెందిన జాన్‌వెస్లీ నూతనంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం వనపర్తి జిల్లా సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ,నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్‌లోని సీపీఎం రాష్ట్ర కార్యాలయం మాకినేని బసవ పున్నయ్య భవన్‌లో జాన్‌వెస్లీని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. సీపీఎం శ్రేణులే కాకుండా సామాజిక నేతలు, సంస్థల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే కాలంలో సామాజిక, వర్గ పోరాటాలు పెన వేసుకొని ఉద్యమాలు నిర్మిస్తామని జాన్‌వెస్లీ తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బలమైన ఉద్యమాలు నిర్మించి పార్టీని, ప్రజాసంఘాలు విస్తరింప చేస్తామన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు పుట్టా ఆంజనేయులు మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు టీ సాగర్, భూపాల్, వెంకట్ రాములు, పి జయలక్ష్మి, వనపర్తి సీపీఎం నాయకులు బాల్యనాయక్, మహబూబ్‌బాషా, ఎం పరమేశ్వరాచారి, డీ కురుమయ్య, బొబ్బిలి నిక్సన్, జీ బాలసామి, జీ గట్టయ్య, నందిమల్ల రాములు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం



మాట్లాడుతున్న వేముల శ్రీనివాస్‌రెడ్డి

కొత్తకోట: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన సాధారణ బడ్జెట్‌లో సామాన్య ప్రజలకు తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వేముల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారం కట్టబెట్టినా ఆర్థిక బడ్జెట్ సామాన్యుల కోసం కాకుండా సంపన్నుల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టినట్లుందన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి బీజేపీకి 8 ఎంపీలు ఉన్నా బడ్జెట్లో ప్రాధాన్యత దక్కలేదని, రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. బీజేపీ ప్రభుత్వం నిరుద్యోగులను, రైతులను, పేదలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం నుంచి రూ.40 వేల కోట్లు జీఎస్టీ రూపంలో వెళ్లినా, తెలంగాణ రాష్ట్రానికి పైసా కూడా ప్రత్యేక కేటాయింపులు జరగలేదన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మేస్త్రీ శ్రీనివాసులు, ఎన్‌జే.బోయేజ్, రవిందర్‌రెడ్డి, నరేందర్ సాగర్, మోహన్‌రెడ్డి, సాయిలు యాదవ్, గోకరయ్య పాల్గొన్నారు.

కనులపండువగా ధ్వజారోహణం



ధరూరు: మండల పరిధిలోని పెద్ద చింతరేవుల శ్రీఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ధ్వజారోహణం, అంకురార్పణ కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభించారు. తెచ్చే సాంప్రదాయ కార్యక్రమంతో పాటు పల్లకి సేవ వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆంజనేయ నామస్మరణతో పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గిరిరావు, ఈఓ కవిత, ఆలయ ప్రధాన అర్చకులు, పెద్ద చింతరేవుల, భీంపురం గ్రామాల భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగట్టు అంజన్నకు చిన్నారెడ్డి పూజలు



ఎర్రగట్టుపై స్వామి వారిని దర్శించుకున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి

వనపర్తి రూరల్: మండలంలోని కాశీంనగర్ ఎర్రగట్టుపై వెలసిన ఆంజనేయస్వామి వారి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి హాజరై గ్రామస్తులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పూజారులు ఆయనకు తీర్థ ప్రసా దాలు అందజేశారు. పలు అభివృద్ధి పనులు, పంట కాల్వల గురించి మాజీ సర్పంచ్ రాములు, గ్రామస్తులు ఆయనకు వివరించారు. అనంతరం ప్రజలు ఎండ్లబండ్లు, ట్రాక్టర్లపై భారీ సంఖ్యలో గట్టుపైకి చేరుకొని నైవేద్యం, పిండి వంటలు తయారు చేసి స్వామి వారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఉమ్మడి గ్రామాల ప్రజలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో 58 కులాలకు మేలు



ఖిల్లాఘనపురంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు మైబు

ఖిల్లాఘనపురం: ఎస్సీ వర్గీకరణతో 58 కులాలుకు మేలు జరుగుతుందని తెలంగాణ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మైబు, జిల్లా అధ్యక్షులు మొల్గర కుర్మయ్య, లక్ష డప్పులు.. వెయ్యి గొంతుల సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ డప్పుస్వామి అన్నారు. శనివారం లక్ష డప్పులు, వెయ్యి గొంతుల చైతన్య రథయాత్ర శనివారం ఖిల్లాఘనపురం చేరింది. బస్టాండు వరకు ర్యాలీగా వచ్చిన డప్పు కళాకారులు బస్టాండ్‌లో డప్పులతో ప్రత్యేక ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 7న మందకృష్ణ మాదిగ తలపెట్టిన లక్ష డప్పులు, వెయ్యి గొంతుకల కళాకారుల మహా ప్రదర్శనకు రాష్ట్ర నలుమూలల నుంచి మాదిగ బిడ్డలు సంకన డప్పుతో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం బాలయ్య, నాగులు, మల్లగల్ల మన్యం, అశోక్, మాజీ సర్పంచు వెంకటరమణ, ఆంజనేయులు, చెన్నకేశవులు, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

నిండుకుండలా రామన్‌పాడు జలాశయం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శనివారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులు ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ కాల్వ నుంచి 920 క్యూసెక్కుల వరద రాగా.. సమాంతర కాల్వ ద్వారా నీటి సరఫరా నిలిపివేసినట్లు వివరించారు. ఎన్టీఆర్ కాల్వకు 800 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 15 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాన్‌గల్: మండల కేంద్రంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్‌శాఖ ఏఈ చందన్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో వీధిలైట్లు వేస్తున్న సందర్భంగా ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, దీంతో గ్రామ ప్రజలు సహకరించాలన్నారు.

గోపాల్‌పేటలో..

గోపాల్‌పేట: మండల కేంద్రంలో ఆదివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని మండల విద్యుత్‌శాఖ ఏఈ హర్షవర్ధన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి (పీహెచ్‌సీ) సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎల్‌టీ లైన్ తీగలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పాతలైన్ రిపేరు పనులు చేయడం, కొత్త లైన్ ఏర్పాటు చేసేందుకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

కారు, లారీ ఢీ: ఇద్దరికి గాయాలు

వనపర్తి రూరల్: కారును లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు మహిళలకు గాయాలైన ఘటన శనివారం వనపర్తి పట్టణ సమీపంలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్‌ఐ హరిప్రసాద్ వివరాల ప్రకారం.. మదునాపురం మండలం, దంతనూర్ గ్రామానికి చెందిన సాంబశివుడు, అతని చిన్నమ్మ కొమ్ముల చెన్నమ్మ, వదిన లాలేంద్ర ముగ్గురు కలిసి వనపర్తి నుంచి పాన్‌గల్ మండలం, రాయినిపల్లి గ్రామానికి కారులో బయలుదేరారు. మార్గమధ్యలో వనపర్తి పట్టణంలోని మెట్టుపల్లి దగ్గర పాన్‌గల్ వైపు నుంచి వస్తున్న లారీ వేగంగా వచ్చి కారును ఢీ కొట్టింది. దీంతో కారులో ఉన్న కొమ్ముల చెన్నమ్మ, లాలేంద్రకు గాయాలయ్యాయి. వారిని వనపర్తి ఆస్పత్రికి తరలించారు. బాధితుడి బావ దామోదర్ రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తికి గాయాలు

వనపర్తి రూరల్: ఎదురెదుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. కోడేరు మండలం, జనుంపల్లికి చెందిన శ్రీశైలం అతని భార్య, కూతురుతో కలిసి బైక్‌పై ఘణపూర్ వైపు నుంచి వస్తున్నారు. వనపర్తి మండలంలోని అంకూర్ గ్రామ శివారులో వనపర్తి నుంచి వస్తున్న గుర్తు తెలియని బైక్ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి కిందపడిన శ్రీశైలానికి కాలు విరిగి తీవ్రగాయాలయ్యాయి. భార్య, కూతురుకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108లో వనపర్తి ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థులకు సహకరించాలి



పాన్‌గల్: పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలకు సిద్ధమయ్యేందుకు వారికి ఎలాంటి పనులు చెప్పకుండా తల్లిదండ్రులు సహకరించాలని ఎంఈఓ శ్రీనివాసులు సూచించారు. సోమవారం మండలంలోని కేతేపల్లి ఉన్నత పాఠశాలలో చదువుతున్న తెల్లరాళ్లపల్లి గ్రామంలోని పదో తరగతి విద్యార్థుల ఇళ్లను సందర్శించి తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు పునాది లాంటిదని, సమయాన్ని వృథా చేయకుండా పరీక్షలకు సిద్ధమయ్యేందుకు తల్లిదండ్రులు సహకరించాలన్నారు. సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థుల ప్రగతిని తెలుసుకునేందుకు నెలకు ఒక్కసారైన పాఠశాలను సందర్శించాలన్నారు. సూచనలు, సలహాలకు సంబంధించిన కరపత్రాలను తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం భాస్కర్, గోపాల్, శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు

ఘనంగా భక్త మార్కండేయ స్వామి జయంతి



అమరచింత: పద్మశాలీల ఆరాధ్యదైవం భక్తమార్కండేయస్వామి జయంతిని శనివారం పద్మశాలి కుల బంధువులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మార్కండేయ ఆలయంలో భక్త మార్కండేయ ఉత్సవ విగ్రహానికి అభిషేకం నిర్వహించి, పట్టణ పుర వీధుల్లో పల్లకీసేవ నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ మేరకు పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షుడు దేవరకొండ లచ్చన్న మాట్లాడారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మహంకాళి విష్ణు, ప్రభాకర్, తాటికొండ రమేష్, మేర్వరాజు, పారుపల్లి చింతన్న, తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని పాతకోటలో భక్త మార్కండేయ స్వామి ఆలయంలో భక్తమార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయ స్వామికి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం ప్రతినిధులు శ్రీనివాసులు, గంగిగోపాల్, శివరాములు, తిరుమల, ఊషన్న, శ్రీశైలం, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.





సచిన్‌కు బీసీసీఐ 'జీవిత సాఫల్య' పురస్కారం

మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) 'జీవిత సాఫల్య' పురస్కారం అందజేసింది. ముంబైలో శనివారం జరిగిన బీసీసీఐ వార్షిక అవార్డుల కార్యక్రమంలో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) అధ్యక్షుడు జై షా చేతుల మీదుగా సచిన్ ఈ పురస్కారాన్ని అందుకున్నాడు. క్రికెట్లో దేశానికి అందించిన విశేష సేవలకు గుర్తింపుగా భారత తొలి కెప్టెన్ కల్నల్ సీకే నాయుడు పేరు మీదుగా 1994 నుంచి ఈ 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డును ప్రదానం చేస్తున్నారు.

పసిడి పతకం నెగ్గిన పల్లవి

డెహ్రాడూన్: జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్‌కు రెండో స్వర్ణ పతకం లభించింది. శనివారం జరిగిన మహిళల వెయిట్‌లిఫ్టింగ్ 71 కేజీల విభాగంలో సనాపతి పల్లవి పసిడి పతకం సొంతం చేసుకుంది. పల్లవి మొత్తం 212 కేజీల బరువెత్తి అగ్రస్థానంలో నిలిచింది. పల్లవి స్నాచ్‌లో 94 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 118 కేజీలు బరువెత్తింది. శుక్రవారం పురుషుల 67 కేజీల విభాగంలో నీలంరాజు ఆంధ్రప్రదేశ్‌కు తొలి బంగారు పతకాన్ని అందించాడు.





కేలా రెనెకి
నికీ ప్రసాద్

ఒకటే లక్ష్యం... రెండో ప్రపంచకప్

నేడు మహిళల అండర్-19 టి20 ప్రపంచకప్ టైటిల్ పోరు
- దక్షిణాఫ్రికాతో భారత్ 'ఢీ'
- ఓటమి లేకుండానే రెండు జట్లు ఫైనల్లోకి
- త్రిష, కమలినిలపై దృష్టి
- మధ్యాహ్నం 12 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

కౌలాలంపూర్: రెండేళ్ల క్రితం దక్షిణాఫ్రికా గడ్డపై జరిగిన మొట్టమొదటి అండర్-19 టి20 ప్రపంచ కప్‌లో భారత అమ్మాయిల జట్టు జగజ్జేతగా అవతరించింది. రెండేళ్ల తర్వాత అదే ప్రపంచకప్‌ను నిలబెట్టుకునేందుకు ఈసారి దక్షిణాఫ్రికా జట్టుతో టీమిండియా ఫైనల్ సంగ్రామానికి సిద్ధమైంది. అజేయంగా తుది పోరుకు అర్హత సాధించిన నికీ ప్రసాద్ నాయకత్వంలోని భారత అమ్మాయిల జట్టు విజయవంతంగా 'రెండో ప్రపంచకప్ మిషన్' పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉంది. భారత్ మాదిరిగానే ఓటమి లేకుండా ఫైనల్ చేరిన దక్షిణాఫ్రికా జట్టు వరల్డ్‌కప్ ముచ్చట తీర్చుకోవాలనే పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలో జోరు మీదున్న రెండు అజేయ జట్ల మధ్య నేడు జరిగే అండర్-19 ప్రపంచకప్ టైటిల్ పోరుపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఈసారీ భారత్ జైత్రయాత్ర కొనసాగుతుందా! లేదంటే కొత్త చాంపియన్ ఆవిర్భవిస్తుందా! మరి కొన్ని గంటల్లో తేలిపోతుంది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ వనరులతో పూర్తిస్థాయి ఆల్‌రౌండ్ సామర్థ్యంతో ఉన్న టీనేజ్ టీమిండియాను ఎదుర్కోవడమే ఎవరికైనా అతిపెద్ద సవాల్. ఇక అలాంటి అబేధ్యమైన జట్టును ఓడించాలంటే మాత్రం దక్షిణాఫ్రికా మైదానంలో పెద్ద 'ప్రపంచ' యుద్ధమే చేయాలనడంలో అతిశయోక్తి లేదు!

ఆ ఇద్దరిని కట్టడి చేస్తే...

తెలంగాణ స్టార్ బ్యాటర్ గొంగడి త్రిష! మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) వేలంలో తనను విస్మరించిన ఫ్రాంచైజీల కళ్లకు కట్టుకున్న గంతల్ని తన అసాధారణ బ్యాటింగ్‌తో విప్పేసింది. ఇప్పుడు 'ఫైనల్ మిషన్' ముంగిట అందరి దృష్టి ఆమెపైనే ఉంది. ఈ టోర్నీలో ఓపెనర్ త్రిష ఫామ్, క్రీజులో ఆమె కనబరుస్తున్న పోరాటపటిమ ప్రత్యర్థి బౌలర్లకు కఠిన సవాళ్లు విసురుతున్నాయి. మరో ఓపెనర్ కమలిని, సనిక చాల్కెలతో కూడిన భారత బ్యాటింగ్ విభాగం పటిష్టంగా ఉంది. దక్షిణాఫ్రికా విజయంపై ఆశలు పెంచుకోవాలంటే మాత్రం ముఖ్యంగా త్రిష, కమలినిలను తక్కువ స్కోరుకు పరిమితం చేయాల్సి ఉంటుంది. ఈ టోర్నీలో త్రిష 265 పరుగులతో టాప్ స్కోరర్‌గా ఉండగా... కమలిని 135 పరుగులతో మూడో స్థానంలో ఉంది. ఆ తర్వాత భారత్ నుంచి అత్యధిక పరుగులు సనిక చాల్కె (6 మ్యాచ్‌ల్లో 69) చేసింది. భారత బౌలింగ్ విభాగాని కొస్తే ఆయుశి శుక్లా, పారుణిక సిసోడియా, వైష్ణవి శర్మలతో కూడిన స్పిన్ త్రయం విశేషంగా రాణిస్తోంది. సహజంగానే సఫారీలకు స్పిన్ అంటేనే కష్టం. అలాంటి జట్టుపై ఫామ్‌లో ఉన్న ఈ ముగ్గురు స్పిన్నర్లు తప్పకుండా ప్రభావం చూపిస్తారు. అలాగని ఫైనల్‌కు చేరిన సఫారీ జట్టును తక్కువ అంచనా వేయలేం. కేలా రెనెకి కెప్టెన్సీలో దక్షిణాఫ్రికా జట్టు సెమీఫైనల్లో గట్టి ప్రత్యర్థి ఆస్ట్రేలియాను బౌలింగ్‌తో కట్టడి చేసి... బ్యాటింగ్‌తో చుట్టేసింది. జెమ్మా బోతా, లౌరెన్స్, కరబొ మెసోలతో కూడిన బ్యాటింగ్ లైనప్, ఆష్లే వాన్‌విక్, ఎన్‌తబిసెంగ్ నిని, శేషిని నాయుడులతో కూడిన బౌలింగ్ దళం కూడా మెరుగ్గా ఉంది.

పిచ్, వాతావరణం

భారత్‌కు బాగా అలవాటైన పిచ్. అటు బౌలింగ్‌కు, ఇటు బ్యాటింగ్‌కు అనుకూలించే అవకాశం ఉంది. సాధారణ వాతావరణమే. వాన ముప్పు దాదాపుగా లేదు.

ఆధిక్యం కోసం ఆఖరి పోరు

నేడు ఇంగ్లండ్‌తో భారత్ ఐదో టి20 మ్యాచ్
- సంజూ సామ్సన్, సూర్యకుమార్‌లకు మరో అవకాశం
- ఒత్తిడిలో బట్లర్ బృందం
- రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



ముంబై: ఇప్పటికే సిరీస్ భారత్ చేతికందింది. ఇక మిగిలిందల్లా ఆధిక్యం పెంచుకోవడమే! మూడు వన్డేల సిరీస్‌కు ముందు ఈ చివరి మ్యాచ్ గెలిచి... 4-1తో ఆధిక్యం, ఆత్మవిశ్వాసంతో వెళ్లాలని టీమిండియా భావిస్తోంది. ఇక ఇంగ్లండ్ పరిస్థితి దీనికి భిన్నం. చేజారిన సిరీస్‌తో ఒత్తిడిలో ఉన్న బట్లర్ బృందం ఇప్పుడు భారత్ ఆధిపత్యానికి గండి కొట్టాలని... ఈ పొట్టి సిరీస్‌లో ఆతిథ్య జట్టు శుభారంభమివ్వగా... విజయంతో ముగింపు తమది కావాలని ఇంగ్లండ్ జట్టు గట్టిగా ఆశిస్తోంది. ఈ నేపథ్యంలో ఆఖరి పోరులో పైచేయి సాధించేందుకు పర్యాటక జట్టు సర్వశక్తులు ఒడ్డేందుకు సిద్ధమైంది. మొత్తంమీద ఇరుజట్ల మధ్య మరో రసవత్తర పోరుకు నేడు వాంఖెడే స్టేడియం వేదిక కానుంది.

సంజూ... మెరిపించు!

ఈ సిరీస్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ ఆడాడు. తిలక్ వర్మ గెలిపించే 'షో' చేశాడు. హార్దిక్ పాండ్యా అసలైన ఆటను గత మ్యాచ్‌లో బయటికి తెచ్చాడు. అక్షర్ పటేల్ బంతితో లేదంటే బ్యాటింగ్‌తో జట్టుకు అక్కరకొస్తున్నాడు. అంతెందుకు అరకొరగా... అంటే శివమ్ దూబే 'కన్‌కషన్'తో తుది జట్టులోకి వచ్చిన హర్షిత్ రాణా కూడా మ్యాచ్ గెలిపించే బౌలింగ్ ప్రదర్శన కనబరిచాడు. కానీ టాప్-4లో ఓపెనర్ సంజూ సామ్సన్, కెప్టెన్ సూర్యకుమార్‌ల తోనే జట్టు మేనేజ్‌మెంట్ కలవరపడుతోంది. తర్వాతి ప్రపంచకప్ వేటకు కోచ్ గంభీర్ కోర్ గ్రూపులోని ఆటగాళ్లు ఇలా వరుసగా విఫలమవడం జట్టుకు ప్రతికూలంగా మారింది. బౌలింగ్‌లో అర్ష్‌దీప్, పాండ్యాలు వెన్నుదన్నుగా నిలుస్తుంటే స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఉన్నపళంగా మ్యాచ్‌ను మలుపుతిప్పే మాయాజాలంతో ఆకట్టుకుంటున్నాడు. రవి బిష్ణోయ్ కూడా ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెడుతున్నాడు.

2-3 లక్ష్యంతో ఇంగ్లండ్

సిరీస్‌ను కోల్పోయిన ఇంగ్లండ్‌కు ఇప్పుడు ఆఖరి పంచ్ మాత్రమే మిగిలుంది. ఇందులో తమ పవర్ చాటుకొని తదుపరి వన్డే సిరీస్‌ను తాజాగా ప్రారంభించాలని బట్లర్ జట్టు అనుకుంటుంది. సాల్ట్ గత మ్యాచ్‌లో టచ్‌లోకి వచ్చినా కొద్దిసేపే క్రీజులో ఉన్నాడు. ఇప్పుడు లయను అందుకుంటే బెన్ డకెట్‌తో ఓపెనింగ్ వికెట్‌కు భారీ ఆరంభం ఇవ్వగలడు. ఇదే జరిగితే... తదుపరి పరుగుల ప్రవాహాన్ని బట్లర్, హ్యారీ బ్రూక్, లివింగ్‌స్టోన్, జాకబ్ బెథెల్, బ్రైడన్ కార్స్‌లు తీసుకెళ్తారు. ఆర్చర్, సకిబ్ మహమూద్ పేస్‌తో ఆకట్టుకుంటుండగా, స్పిన్‌తో ఆదిల్ రషీద్ నిలకడను ప్రదర్శిస్తున్నాడు.

5 వాంఖెడే మైదానంలో ఇప్పటి వరకు భారత జట్టు ఐదు టి20 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో మూడింటిలో గెలిచి, రెండింటిలో ఓడిపోయింది. చివరి మూడు మ్యాచ్‌ల్లో భారత జట్టే నెగ్గింది.

సిరీస్ చేజారినా... సమరంలో పట్టు కోల్పోరాదని ఐదో టి20లో నిరూపించుకోవాలని ఇంగ్లండ్ బృందం చూస్తోంది.

పిచ్, వాతావరణం

వాంఖెడే బ్యాటింగ్‌కు అచ్చొచ్చే పిచ్. చాలా మ్యాచ్‌ల్లో, ప్రత్యేకించి టి20ల్లో చేజింగ్ జట్లకు విజయ అవకాశాలిచ్చింది. అలాగని బౌలింగ్ తేలిపోదు. స్పిన్నర్లు ప్రభావం చూపొచ్చు. వాన ముప్పు లేదు.

బడ్జెట్‌లో క్రీడలకు రూ.3,794 కోట్లు

గతం కంటే 351.98 కోట్లు పెంపు

న్యూఢిల్లీ: భారత ప్రభుత్వం కొత్త బడ్జెట్‌లో క్రీడలు, యువజన సర్వీసుల శాఖకు రూ. 3,794.30 కోట్లు కేటాయించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆ మేరకు నిధుల్ని కేటాయించారు. గత బడ్జెట్‌లో రూ. 3442.32 కోట్లు ఇవ్వగా... తాజాగా రూ.351.98 కోట్లు పెంచింది. కేంద్ర క్రీడాశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఖేలో ఇండియా' కార్యక్రమానికే ఈ క్రీడా బడ్జెట్లో ప్రాధాన్యం దక్కింది. గతంలో రూ. 800 కోట్లు కేటాయించగా ఈసారి ఆ మొత్తాన్ని రూ. 1000 కోట్లకు పెంచింది. నికరంగా రూ. 200 కోట్లను హెచ్చింపు చేసింది. జాతీయ క్రీడా సమాఖ్యలకు ఇచ్చే గ్రాంట్లను కూడా పెంచింది. గతంలో సమాఖ్యలకు రూ. 340 కోట్లు ఇవ్వగా తాజా ఆర్థిక సంవత్సరంలో రూ. 400 కోట్లు కేటాయించారు. భారత స్పోర్ట్స్ అథారిటీకి రూ. 830 కోట్లు (గత బడ్జెట్ కంటే రూ. 15 కోట్లు అదనం) ఇవ్వనున్నారు. అథ్లెట్ల పారదర్శకత పోటీ కోసం పాటుపడుతున్న జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) లాబోరేటరీకి రూ. 23 కోట్లు (గతంలో రూ. 18.70 కోట్లు) కేటాయించింది. 1998లో ఏర్పాటు చేసిన జాతీయ స్పోర్ట్స్ అభివృద్ధి నిధి కోసం రూ. 18 కోట్లను యథాతథంగా కొనసాగించినప్పటికీ... క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకాలకు స్వల్పంగా కోత పెట్టింది. పోయిన ఏడాది రూ. 42.65 కోట్లు ఇస్తే ఈసారి రూ. 37 కోట్లకు పరిమితం చేసింది. యువజన సర్వీసులకు భారీగా కోత పెట్టింది. గత బడ్జెట్లో రూ. 55 కోట్లు కేటాయిస్తే ఈసారి కేవలం రూ. 11.70 కోట్లే విదిలించింది. జమ్మూకశ్మీర్‌లో క్రీడా సదుపాయల కల్పన కోసం రూ. 20 కోట్లు ఇవ్వనుంది. గతం కంటే రూ. 14 కోట్లు ఎక్కువగా కశ్మీర్‌లో మౌలిక సౌకర్యాలకు వెచ్చించనుంది.

టోగోపై 2-0 ఆధిక్యంలో భారత్

న్యూఢిల్లీ: డేవిస్‌కప్ ప్రపంచ టీమ్ టెన్నిస్ వరల్డ్ గ్రూప్-1 ప్లే ఆఫ్ మ్యాచ్‌లో భారత్ శుభారంభం చేసింది. టోగో జట్టుతో శనివారం మొదలైన ఈ పోటీలో తొలి రోజు జరిగిన రెండు సింగిల్స్‌లోనూ భారత ఆటగాళ్లు ఆడుతూ పాడుతూ విజయం సాధించారు. ఫలితంగా భారత్ 2-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. తొలి సింగిల్స్‌లో శశికుమార్ ముకుంద్ 6-2, 6-1తో లియోవా (టోగో)పై నెగ్గగా... రెండో సింగిల్స్‌లో రామ్‌కుమార్ 6-0, 6-2తో సెటోడ్జి (టోగో)ను ఓడించాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో


సాక్షి సినిమా


• 'దిల్' రాజు, అనిల్ రావిపూడి, శిరీష్

ఈ సక్సెస్ చాలా పాఠాలు నేర్పింది

-'దిల్' రాజు

''ఇండస్ట్రీలో బడ్జెట్ కాదు.. కథే ముఖ్యం. మేము కూడా కథలని నమ్ముకుని సినిమాలు నిర్మించాం. కొత్త దర్శకులతో తీసినప్పుడు ఎన్ని విజయాలు వచ్చాయో అందరికీ తెలిసిందే. అయితే కాంబినేషన్స్ అంటూ నాలుగైదేళ్లుగా మేం తడబడుతున్నాం. 'సంక్రాంతికి వస్తున్నాం' హిట్‌తో అనిల్ మళ్లీ మాకు ఒక రహదారి వేసి ఇచ్చాడు. ఈ సక్సెస్ నాకు కూడా చాలా పాఠాలు నేర్పించింది'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన డిస్ట్రిబ్యూటర్స్ గ్రాటిట్యూడ్ మీట్‌లో 'దిల్' రాజు మాట్లాడుతూ- ''సాధారణంగా డిస్ట్రిబ్యూటర్స్‌కి బ్రేక్ ఈవెన్ అయితేనే సూపర్ హిట్. అయితే వాళ్లు నష్టపోయినప్పుడు కూడా సినిమా సూపర్ హిట్ పోస్టర్స్ పడుతుంటాయి. 90 శాతం ఫెయిల్యూర్స్, కేవలం 10 శాతం మాత్రమే సక్సెస్ ఉండే ఇండస్ట్రీ ఇది. 20 ఏళ్లుగా మాతో ప్రయాణం చేస్తున్న డిస్ట్రిబ్యూటర్స్‌కి ధన్యవాదాలు'' అని చెప్పారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ- ''సంక్రాంతికి వస్తున్నాం' ఆరు రోజుల్లోనే రూ.100 కోట్లు షేర్ రాబట్టింది. ఓ రీజినల్ ఫిలింకి చూడలేనేమో అనుకున్న రూ. 300 కోట్ల గ్రాస్ నంబర్ మా మూవీతో చూడబోతున్నందుకు హ్యాపీ'' అని తెలిపారు. ''20 ఏళ్ల క్రితం డిస్ట్రిబ్యూటర్‌కి ఉన్న విలువ ఇప్పుడు లేదు. ఇలాంటి సమయంలో వాళ్లు తలెత్తుకునేలా చేసిన సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం'' అని శిరీష్ పేర్కొన్నారు. డిస్ట్రిబ్యూటర్స్ సాయికృష్ణ, రాజేశ్, హరి, శోభన్, ఎల్వీఆర్ మాట్లాడారు.


• 'తంగలాన్'లో విక్రమ్


• 'గామి'లో విశ్వక్ సేన్

అరుదైన గౌరవం

విశ్వక్ సేన్ హీరోగా నటించిన 'గామి', విక్రమ్ కథానాయకుడిగా చేసిన 'తంగలాన్' సినిమాలకు అరుదైన గౌరవం దక్కింది. 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ రోటర్‌డామ్ 2025'లో ప్రదర్శనకి ఈ చిత్రాలు ఎంపికయ్యాయి. నెదర్లాండ్స్ వేదికగా ఈ నెల 9 వరకూ జరగనున్న ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారత సినిమాలకు చోటు దక్కడం విశేషం. విశ్వక్ సేన్ హీరోగా, చాందినీ చౌదరి హీరోయిన్‌గా రూపొందిన తెలుగు చిత్రం 'గామి'. ఈ చిత్రంతో విద్యాధర్ కాగిత దర్శకుడిగా పరిచయమయ్యారు. కార్తీక్ శబరీష్ నిర్మించిన ఈ చిత్రం 2024 మార్చి 8న విడుదలైంది. ఈ సినిమాలో విశ్వక్ సేన్ అఘోరాగా నటించారు. ఆయన నటనకు ప్రేక్షకుల నుంచి మంచి మార్కులు పడ్డాయి. అదే విధంగా విక్రమ్ హీరోగా నటించిన తమిళ చిత్రం 'తంగలాన్'. పా. రంజిత్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో మాళవికా మోహనన్, పార్వతీ తిరువోతు కీలక పాత్రల్లో నటించారు. కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ సినిమా 2024 ఆగస్టు 15న తమిళంతో పాటు తెలుగులోనూ విడుదలైంది. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్‌లో జరిగిన సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. ఈ సినిమాలో మరోసారి తన నట విశ్వరూపం చూపించారు విక్రమ్. ఇక 'గామి, తంగలాన్'లు 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ రోటర్‌డామ్ 2025' ప్రదర్శనకు ఎంపిక కావడంపై పలువురు అభినందనలు తెలుపుతున్నారు.

పల్లెటూరి డిటెక్టివ్


• కిశోర్ శ్రీకృష్ణ, తనికెళ్ల భరణి, మిధున ప్రియ

తనికెళ్ల భరణి ప్రధాన పాత్రలో 'అసుర సంహారం' అనే చిత్రం రూపొందనుంది. కిశోర్ శ్రీకృష్ణ దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో మిధున ప్రియ కీలక పాత్ర చేయనున్నారు. శ్రీ సాయి ప్రవర్తిక బోయళ్ల సమర్పణలో శ్రీ సాయి తేజో సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై సాయి శ్రీమంత్, శబరీష్ బోయళ్ల నిర్మించనున్న ఈ చిత్రాన్ని శనివారం ప్రకటించారు. 'క్రైమ్, సస్పెన్స్, థ్రిల్లర్ చిత్రాలకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం కాన్సెప్ట్, కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రాలకి ప్రేక్షకాదరణ ఉంటోంది. ఈ క్రమంలోనే విలేజ్ క్రైమ్ డ్రామాగా 'అసుర సంహారం' రూపొందనుంది. ఈ మూవీలో తనికెళ్ల భరణి విలేజ్ డిటెక్టివ్‌గా ఓ విభిన్నమైన పాత్రలో ప్రేక్షకులను అలరించనున్నారు. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మిధున ప్రియ, కెమెరా: బాలు ఏబీసీడీ, సంగీతం: కరీం అబ్దుల్.

స్క్రీన్స్ పెరగడం ఆనందం

- విష్ణువర్ధన్


• విష్ణువర్ధన్, ఆకాశ్ మురళి, స్నేహ

ఆకాశ్ మురళి, అదితీ శంకర్ జంటగా 'పంజా' ఫేమ్ విష్ణువర్ధన్ దర్శకత్వంలో రూపొందిన తమిళ సినిమా 'నెసిప్పాయ'. ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ జనవరి 14న విడుదలైంది. ఈ సినిమాను 'ప్రేమిస్తావా' టైటిల్‌తో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ జనవరి 31న తెలుగులో విడుదల చేసింది. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం సక్సెస్‌మీట్‌లో ఆకాశ్ మురళి మాట్లాడుతూ- ''తెలుగు పరిశ్రమకు నన్ను ఆహ్వానించిన ప్రేక్షకులకు థ్యాంక్స్. మా సినిమా తెలుగు ప్రేక్షకులకూ నచ్చడం హ్యాపీగా ఉంది'' అన్నారు. ''రిలేషన్‌షిప్ నేపథ్యంలో జరిగే రొమాంటిక్ డ్రామా ఇది. ఈ సినిమాలోని క్రైమ్ ఎలిమెంట్ అందర్నీ సర్‌ప్రైజ్ చేస్తుంది. ఆకాశ్ ప్రతిభగలవాడు. యాక్షన్ స్టంట్స్‌ను కూడా తనే చేశాడు. అదితి అద్భుతంగా నటించింది. 'ప్రేమిస్తావా' సినిమాకు స్క్రీన్స్ పెరుగుతున్నాయని మైత్రీవారు చెప్పడం హ్యాపీగా ఉంది'' అని చెప్పారు విష్ణువర్ధన్. ''ఈ సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు సహనిర్మాత స్నేహ.

సస్పెన్స్


• ఆర్పీ పట్నాయక్, సురేష్

రాంప్రసాద్, జెమినీ సురేష్, కిరీటి, సాయి ప్రసన్న, సాయి కిరణ్, నజియా ఖాన్, అద్వైత చౌదరి ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'వైఫ్ ఆఫ్ అనిర్వేష్'. గంగ సప్తశిఖర దర్శకత్వం వహించారు. మహేంద్ర గజేంద్ర సమర్పణలో వెంకటేశ్వర్లు మెరుగు, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మించారు. ఈ సినిమా ఎస్‌కేఎంఎల్ మోషన్ పిక్చర్స్ ద్వారా తెలుగులో రిలీజ్ కానుంది. ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను దర్శకుడు, మ్యూజిక్ డైరెక్టర్ ఆర్పీ పట్నాయక్ విడుదల చేసి, మాట్లాడుతూ- ''అద్భుతమైన స్క్రీన్‌ప్లేతో రూపొందిన ఈ సస్పెన్స్ థ్రిల్లర్ మంచి విజయం సాధిస్తుంది'' అన్నారు. వెంకటేశ్వర్లు మెరుగు, శ్రీ శ్యామ్ గజేంద్ర మాట్లాడుతూ-''ఓ మిమిక్రీ ఆర్టిస్ట్ తన ఇబ్బందులను తనకు తెలిసిన కళతో ఎలా పరిష్కరించాడు? అనేది దర్శకుడు ఆసక్తిగా తెరకెక్కించారు'' అని తెలిపారు.

సూర్యాపేట్ నేపథ్యంలో....


• ఈశ్వర్, నైనా

'కొత్తగా మా ప్రయాణం' మూవీ ఫేమ్ ఈశ్వర్ హీరోగా, నైనా సర్వర్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'సూర్యాపేట్ జంక్షన్'. రాజేశ్ నాదెండ్ల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అభిమన్యు సింగ్ ప్రధాన పాత్ర పోషించారు. అనిల్‌కుమార్ కాట్రగడ్డ, ఎన్. శ్రీనివాసరావు నిర్మించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ట్రైలర్ విడుదల వేడుకలో ఈశ్వర్ మాట్లాడుతూ- ''సూర్యాపేట్ జంక్షన్'కి నేను కథ రాశాను. సూర్యాపేట పరిసరాల్లో జరిగే కథ ఇది. ప్రభుత్వం నుంచి ఉచితాలు తీసుకోవడం వల్ల మధ్య తరగతి ప్రజలు ఎలాంటి ఇబ్బందుల్లో ఇరుక్కుంటున్నారో మా చిత్రంలో చూపిస్తున్నాం'' అన్నారు. ''మా సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. రోషన్ సాలూరి, గౌర హరి మంచి సంగీతం ఇచ్చారు'' అన్నారు అనిల్ కుమార్.

ఓటీటీ ఇది చూడొచ్చు

చూసి తెలుసుకోదగ్గ డాక్యుమెంటరీ

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో బాలీవుడ్ చిత్రం ది రోషన్స్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఈ జీవితమనే చక్రంలో కొందరి వంతు వస్తుంది, కొందరి వంతు ముగుస్తుంది. ముగిసిన వారి జ్ఞాపకాలు మన మనసులో పదిలంగా ఉంటాయి. వారిలో ఎందరో మహానుభావులుంటారు. వారి జ్ఞాపకాలైతే మనం నెమరువేసుకోవచ్చేమో కానీ ఆ కాలంలో వారు పడ్డ కష్టం, ఆనందం కానీ మనకు తెలియవు. అటువంటి వారి జీవిత చక్రానికి వెండితెర రూపమిస్తే మన ఆనందం అవధులు దాటుతుంది. ఆ కోవకు చెందినదే నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమ్ అవుతున్న 'ది రోషన్స్' టీవీ షో. ఇదో డాక్యుమెంటెడ్ మినీ సిరీస్. ఒకే కుటుంబానికి చెందిన నలుగురి జీవిత చక్రాలకు తెర రూపమే ఈ షో. బాలీవుడ్ దిగ్గజ రోషన్ కుటుంబానికి చెందిన నాటి సంగీత కళాకారులు రోషన్ లాల్ నాగ్రత్ నుండి నేటి తరం నటుడు హృతిక్ రోషన్ వరకు... వారి జీవిత ప్రయాణాన్ని ఎంతో అందంగా చూపించారు ఈ డాక్యుమెంటరీలో. ఓ రకంగా చెప్పాలంటే మనం ఈ షో ద్వారా నాలుగు తరాలు ప్రయాణిస్తాం. ముందుగా రోషన్ కుటుంబం నుండి రోషన్ లాల్ నాగ్రత్ సంగీత ప్రయాణంతో ఈ షో ప్రారంభమై ఆ పై అతని కొడుకు రాజేష్ రోషన్ బాలీవుడ్ ప్రయాణంతో సాగి, ఆ తరువాత ఆయన కొడుకు రాకేశ్ రోషన్ నటనా ప్రయాణంతో పాటు ప్రొడ్యూసర్‌గా ఎలా రాణించారు? అన్నది చూపిస్తూ నేటి తరం కథానాయకుడు హృతిక్ రోషన్ బాలీవుడ్ ప్రయాణంతో షో ముగుస్తుంది. ఈ షో ద్వారా నాటి బాలీవుడ్ సంగీతం నుంచి నేటి తరం సినిమాల వరకు మనకు తెలియని ఎన్నో రహస్యాలతో పాటు హిందీ చిత్ర పరిశ్రమలోని అప్పటి ఒడిదుడుకులను ఇప్పటి పట్టు విడుపులను సవివరంగా చూపించారు. ఈ రోషన్ కుటుంబానికి బాలీవుడ్ పరిశ్రమలో ఉన్న నాటి, నేటి దిగ్గజాలు తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ప్రేక్షకులకు చెప్పడం మరింత బావుంది. అందుకే 'ది రోషన్స్' చూసి నేర్చుకోదగ్గ, తెలుసుకోదగ్గ డాక్యుమెంటరీ. ఇది ప్రతి సినిమా ప్రేక్షకుడు తమ వ్యక్తిగత లైబ్రరీలో భద్రపరుచుకోదగ్గ డాక్యుమెంటెడ్ మినీ సిరీస్. వర్త్‌ఫుల్ టు వాచ్.

– ఇంటూరు హరికృష్ణ